ప్రజాశక్తి
సోమవారం 10 ఫిబ్రవరి 2025
5
అనంతపురం

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-అనంతపురం

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నగర సమీపంలో ఉన్న శిల్పారామంలో ఆదివారం శ్రీదేవి నృత్య కళానిలయం, నృత్య గురువు, కుమారి హిమజ బృందం నిర్వహించిన భరతనాట్య నాట్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. సాయంత్రం 5:30 నుంచి రాత్రి 7 గంటల వరకూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నాట్యం చేస్తున్న చిన్నారులు

మరిన్ని భూకేటాయింపులు

సోలార్, విండ్ ప్రాజెక్టులకు అనుమతి
కేటాయించిన మూడు సంస్థలు ఒక్కరివే
లీజు పద్ధతిలో భూసేకరణకు అనుమతి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెద్దఎత్తున సోలార్ ,విండ్ ప్రాజెక్టులకు భూములు కేటాయించారు. తాజాగా మరిన్ని ప్రాజెక్టులకు అనుమతులిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏకంగా 1478 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వీటికి అవసరమైన భూసేకరణను లీజు పద్ధతుల్లో చేసుకునే వెసలుబాటును కల్పించింది. ఇప్పటికే ఆయా సంస్థలు భూములపై కన్నేయడమే కాకుండా చాలా వరకు లావాదేవీలు కొనసాగించుకున్నట్టు సమాచారం.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనుమతినిచ్చిన సంస్థలు, ప్రాంతాలు

అనంతపురం, కడప జిల్లాల పరిధిలోని తాడిపత్రి, కొండాపురం మండలాళ పరిధిలోని బొడాయపల్లి గ్రామం పరిధిలో సెయిల్ సోలార్ సంస్థకు 300 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి అనుమతినిచ్చింది. సత్యసాయి జిల్లా పరిధిలో ఎకరన్ ఎనర్జీ సంస్థకు రాళ్ల అనంతపురం గ్రామం పరిధిలో 201 మెగావాట్ల విండ్ ఎనర్జీ విద్యుత్ ఉత్పత్తికి అనుమతినిచ్చింది. ఇదే సంస్థకు కనగానపల్లి మండలం మద్దెలచెరువు వద్ద 50 మెగావాట్ల విండ్, సోలార్ హైబ్రీడ్ ప్రాజెక్టుకు అనుమతినిచ్చారు. బెళుగుప్ప మండలం గంగవరం గ్రామం పరిధిలో 400 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పాదనకు టాటా సంస్థకు అనుమతులిచ్చారు. కనగానపల్లి, రామగిరి మండలాల పరిధిలో ముత్తవకుంట, ఎలకుంట్ల, రామగిరి, నసనకోట గ్రామాల పరిధిలో కడప రెనీవబుల్స్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థకు 231 మెగావాట్ల అనుమతులిచ్చారు. కళ్యాణదుర్గం ప్రాంతంలోని అడవిగొల్లపల్లి, బచ్చుపల్లి, యాటకల్లు, నరసాపురం గ్రామాల పరిధిలో 178 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అనంతపురం రెన్యూవబుల్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థకు అప్పగించారు మక్కినవారలిపల్లి, మోటరుచింతలపల్లి, కురాకులపల్లి, పేరూరు, కొండాపురం గ్రామాల పరిధిలో ఆస్పిరి రెన్యూబుల్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థకు 118 మెగావాట్లకు అనుమతినిచ్చారు.

ఆ మూడు సంస్థలు ఒక్కరివే : అనంతపురం రెన్యూబుల్ ప్రయివేటు లిమిటెడ్, ఆస్పిరి ప్రయివేటు లిమిటెడ్, కడప రెన్యూవబుల్ ప్రయివేటు లిమిటెడ్ మూడు సంస్థలు వేరువేరుగానున్నా అందులో డైరెక్టర్లు మాత్రం ఒక్కటే కావడం గమనార్హం. ఇంత పెద్దఎత్తున ఈ సంస్థలకు అనుమతులివ్వడంపై పలు సందేహాలు వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

ప్రభుత్వాలు, పాలకుల నిర్లక్ష్యం.. పేదలకు కష్టం..!

మృతదేహాన్ని ఖననం చేసిన స్థలం పక్కనే పైపులైన్ మరమ్మతులు చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - బ్రహ్మసముద్రం

ప్రభుత్వాలు, పాలకులు ప్రజా సమస్యలపై స్పందించకుండా పేదలను కష్టాల పాలు చేస్తున్నారు. మనిషి చనిపోతే ఆరడుగుల నేలను ఇవ్వలేని పరిస్థితుల్లో ఈ ప్రభుత్వాలు ఉన్నాయి. మృతిచెందిన వ్యక్తి పార్థివ దేహాన్ని ఇంట్లో ఉంచుకోలేక దయనీయ పరిస్థితుల్లో గ్రామ సమీపంలోని ఖాళీ స్థలాల్లో కుటుంబ సభ్యులు ఖననం చేస్తున్నారు. అయితే ఈ స్థలాలు ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండడంతో ఖననం చేసిన రెండు, మూడు రోజుల్లోపే ఆ మృతదేహాలు బయటపడే అమానవీయ ఘటనలు చూడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఇలాంటి ఘటనే అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం పరిధిలోని గోవిందయ్యదొడ్డి గ్రామంలో ఆదివారం వెలుగు చూసింది. గ్రామాలకు నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటుచేసిన పైప్ లైన్ వద్ద మతదేహాన్ని ఖననం చేయడంతో విధిలేని పరిస్థితుల్లో తాగునీటి సరఫరా సిబ్బంది అక్కడ తవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అక్కడ ఖననం చేసిన మృతుని కుటుంబ సభ్యులు, గ్రామీణుల కోసం నీటి సరఫరాను చేసేందుకు పనులు చేపట్టిన కార్మికులు అందరూ బాధపడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాలు, పాలకుల నిర్లక్ష్యానికి గురైన ఆ పేదలు తమ కష్టాన్ని ఎవరు తీరుస్తారంటూ వాపోతున్నారు. అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం గోవిందయ్యదొడ్డి గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి....

గోవిందయ్య దొడ్డి గ్రామానికి చెందిన బోయ రామదాసు శనివారం మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని వేపులపర్తి, గోవిందయ్య దొడ్డి గ్రామాలకు మధ్యన ఉన్న కప్పలకుంట చెరువు కింద చేశారు ఖననం చేశారు. అయితే ఆ ప్రాంతం నుండే తాగునీటి పైపులైనును గతంలో వేశారు. ప్రస్తుతం ఆ పైపులైనుకు లీకేజీ ఏర్పడింది. దీంతో పలు గ్రామాలకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో కార్మికులు ఆ పైపులైను లీకేజీని మరమ్మతు చేయడానికి ఆదివారం వచ్చారు. పైపులైను లీకేజీ పనులు చేయడంలో భాగంగా శనివారం వ్యక్తిని ఖననం చేసిన ప్రాంతంలో మరమ్మతు చేయాల్సి వచ్చింది. ఎస్ఆర్‌పి కార్మికులు చిత్తయ్య, గోవిందు, వన్నూరుస్వామి, తిప్పేస్వామి భూమిని తవ్వుతున్న సమయంలో మృతదేహానికి సంబంధించిన కాళ్లు చేతులు బయటకు వచ్చాయి. ఇంత భయానక వాతావరణంలో కూడా కార్మికులు తమ విధులు చేయాల్సి వచ్చింది. కార్మికులు పని చేస్తున్నప్పుడు అటుగా వెళ్లిన బాటసారులు, వాహనదారులు ఆశ్చర్యపోయారు. కనీసం ఈ ఘటనతోనైనా పాలకులు, అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామస్తులకు సరైన స్థలంలో శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇక కార్మికులకు కూడా వేతనాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని వారికి కూడా వేతనాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా తాగునీటి ట్యాంకు

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని పెన్నఅహోబిలంలో తాగునీటి ట్యాంకు నిరుపయోగంగా మారింది. జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలో ఉగ్ర నరసింహ స్వామి విగ్రహం ముందు ఉన్న తాగునీటి ట్యాంకు నిరుపయోగంగా ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం భక్తులు ఆలయానికి వచ్చి పూజలు చేస్తుంటారు. అంతేగాకుండా రహదారికి ఆనుకుని ఉండటంతో ప్రయాణికులు కూడా తాగునీటిని వినియోగించుకునేవారు. ఈనేపథ్యంలో దాదాపు నెల రోజుల నుంచి తాగునీటి ట్యాంకు పని చేయకపోవడంతో భక్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి ట్యాంకును వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

తాగునీటి ట్యాంకు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

డిఎంహెచ్ఒ ఫిరోజ్‌బేగం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కాలానుగుణంగా వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని వేసవిని దృష్టిలో ఉంచుకొని వృద్ధులు, పిల్లలు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఫిరోజ్ బేగం పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : సీజనల్ వ్యాధులు, విజృంభనపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు అదుపులోనే ఉన్నాయి. ఇటీవల ప్రాథమిక ఆరోగ్యశాఖ సిబ్బంది పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సర్వేలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మలేరియా, డెంగీ, పిల్లలకు మధుమేహం వ్యాధులు అదుపులోనే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మలేరియా కేసులు ఐదు ఉండగా డెంగీ కేసులు మూడు గుర్తించాం. వారు చికిత్సలు పొందుతున్నారు. 104 సిబ్బంది ద్వారా గ్రామాల్లో బిపి, షుగర్, క్యాన్సర్ వంటి పరీక్షలను ఎత్తు బరువు పరీక్షించి ఆహార అలవాట్లను పరిశీలిస్తూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎండాకాలం వడదెబ్బ వాంతులు విరోచనాలు నీరు కలుషితం వలన వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర : జిల్లాలోని లెప్రసీ కేసులు ఎన్ని ఉన్నాయి.?

జ: జిల్లాలో లెప్రసీ కేసులు గుర్తించడానికి జనవరి 20 నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు సర్వే నిర్వహించాం. స్పర్శ లేని మచ్చలు కలిగిన వ్యక్తులను గుర్తించి వ్యాధి నిర్ధారణ అయితే వారికి ప్రభుత్వం నుండి ఉచితంగా మందులను అందజేసి వ్యాధిని అదుపు చేస్తాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సర్వేలు నిర్వహించి జిల్లావ్యాప్తంగా 3621 కేసులు గుర్తించగా వాటిలో 1341 కేసులను పరీక్షించగా అందులో ఐదు కేసులు మాత్రం నిర్ధారణయ్యాయి. గతంలో గుర్తించిన కేసులను సైతం పరిశీలించి పరీక్షలు నిర్వహించారు.

ప్ర : పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు అందుబాటులో ఉండన్న ఆరోపణల పై మీ అభిప్రాయం.?

జ : జిల్లా వ్యాప్తంగా ఏరియా ఆసుపత్రులలో 24 గంటలు డాక్టర్ అందుబాటులో ఉంటున్నారు. షిప్టుల ప్రకారం వచ్చి వెళుతుంటారు. అదేవిధంగా అర్బన్ హెల్త్ సెంటర్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారు. పలు కేంద్రంలో డాక్టర్లు అందుబాటులో ఉండరన్న మాట అవాస్తవం. జిల్లా అధికారులు తరచూ ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపియన్ల ద్వారా విజిట్లు నిర్వహిస్తున్నారు. విధులకు హాజరు కాని వారిపై తమ దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

డిఎంహెచ్ఒ ఫిరోజ్‌బేగం

ప్ర : జిల్లా వ్యాప్తంగా సిబ్బంది ,మందుల కొరత ఉందా?

జ: శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఎలాంటి మందుల కొరత లేదు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 47, వుండగా వాటిలో 26 మంది స్టాఫ్ నర్సుల కొరత ఉంది. రామగిరిలో డాక్టర్ లేరు. వాటిని భర్తీ చేయడానికి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియామకాలు జరిపి సిబ్బంది కొరత అధిగమిస్తాం.

భ్రమజనిత బడ్జెట్

సంక్షేమానికి కోతలు
'కార్పొరేట్'కు ప్రయోజనాలు
కేంద్ర బడ్జెట్‌పై సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ భ్రమజనితమైందే తప్ప సామాన్యులకు మేలు చేసే విధంగా లేదని వక్తలు పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం, బిఎస్పీ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై సదస్సు జరిగింది. విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఎజి.రాజమోహన్, బిఎస్పీ నాయకులు నాగభూషణం అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రముఖ సామాజికవేత్త సత్యబోసు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజా సంక్షేమానికి, సామాజిక రంగానికి కోతలు పెట్టిందని చెప్పారు. వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నామని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగించినంతగా కేటాయింపులు ఆ రంగంలో పెరగలేదని చెప్పారు. అంతకు మునుపు ఏడాది రూ.1.64 లక్షల కోట్లు కేటాయిస్తే ఈసారి రూ.1.67 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారని వివరించారు. విద్య,వైద్యానికి అదే పరిస్థితి ఉందన్నారు. ఇక సామాజిక అభివృద్ధిని పూర్తిగా విస్మరించినట్లు ఈ బడ్జెట్ కనిపిస్తోందని చెప్పారు. 150 పథకాలు సామాజిక తరగతుల పరిధిలో ఉన్నాయన్నారు. వీటికి గతేడాది రూ.60 వేల కోట్లు కేటాయిస్తే ఈసారి రూ.56 వేల కోట్లు కేటాయించారని తెలిపారు. ఇందులో సఫాయి కర్మచారీ కార్పొరేషన్‌కు చూస్తే బడ్జెట్‌లో కేటాయింపులు కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే ఉన్నాయని చెప్పారు. దీంతో అణగారిన వర్గాల అభ్యున్నతి ఎలా సాధ్యమో కేంద్ర ప్రభుత్వమే చెప్పాల్సి ఉంటుందన్నారు. దేశంలో అత్యధిక మంది జీవనం సాగిస్తున్న గ్రామీణ ప్రాంతాభివృద్ధికి భారీగా కోతలు పెట్టిందన్నారు. సామాన్య ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఈ బడ్జెట్ ఏర్పాటు జరగలేదన్నది దీని ద్వారా స్పష్టమవుతుందన్నారు. ప్రొఫెసరు బావయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్యులకు పెద్దపీట వేసామని చెబుతున్నా ఆచరణలో లబ్ధిపొందుతున్నది పెద్ద కార్పొరేట్ సంస్థలేనని చెప్పారు. ఎంఎస్ఎంఇకి ఊతమిచ్చామని చెబుతున్నా ఆచరణలో చూసినప్పుడు ఈ ఎంఎస్ఎంఇల కింద లబ్ధిపొందుతున్నది పెద్ద కార్పొరేట్ కంపెనీలేనని చెప్పారు. మానవ హక్కుల వేదిక నాయకులు సుబ్బన్న మాట్లాడుతూ బడ్జెట్ అంటే ఆదాయ, వ్యయాలు మాత్రమే కాదన్నారు. ఆ ఏడాది కాలానికి ప్రభుత్వం పరంగా ప్రకటించే విధాన ప్రకటన అని చెప్పారు. ఇది ఆ రకంగా కాకుండా అంకెల గారడి పద్ధతుల్లో నడుస్తోందన్నారు. ఈ బడ్జెట్ పన్ను మినహాయింపు రూ.12 లక్షలు వరకు ఇవ్వడం చూట్టే నడిచిందన్నారు. దీని వలన చేకూరే ప్రయోజనం అతి కొద్ది మందికి మాత్రమేనని చెప్పారు. ఎక్కువ మందికి సంబంధించిన చర్చ ఈ బడ్జెట్‌లో జరగలేదని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ కార్పొరేట్లకు మేలు చేసే విధంగానున్న ఈ బడ్జెట్‌కు ప్రత్యామ్నాయ బడ్జెట్ గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని వామపక్ష పార్టీలు భావించాయని చెప్పారు. ఈనెల 14వ తేదీ నుంచి 23 వరకు ప్రచారోద్యమాన్ని రాష్ట్రంలో చేపట్టడం జరిగిందన్నారు. వ్యవసాయరంగాన్ని పూర్తిగా ప్రయివేటుపరం చేసే విధంగా ఈ బడ్జెట్ ఉందన్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు రాష్ట్రంలోనూ సాగుతున్నాయన్నారు. దీని వలన జరిగే నష్టాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడుతూ కార్పొరేట్లకు సంపదన దోచే పెట్టే విధంగానున్న ఈ బడ్జెట్ గురించి ప్రజల్లోకెళ్లి వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఒ.నల్లప్ప, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో పాల్గొన్న వక్తలు

మధ్యప్రదేశ్ ధార్ గ్యాంగ్ అరెస్టు

రూ.90 లక్షల బంగారు, వజ్రాభరణాలు, రూ.19,35,000 నగదు స్వాధీనం
దక్షిణ భారత దేశంలో ఈ గ్యాంగ్‌పై 32కు పైగా కేసులు

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

నగరంలోని శ్రీనగర్ కాలనీ శివారు ప్రాంతమైన రాజహంస స్వీట్ హోమ్స్‌లోని 3 విల్లాస్ లో జరిగిన చోరీ కేసును అనంతపురం పోలీసులు ఛేదించారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలలో మోస్ట్ వాంటెడ్ గా ఉన్న మధ్యప్రదేశ్ ధార్ గ్యాంగ్ ఈ చోరీలకు పాల్పడినట్లు అనంతపురం పోలీసులు తేల్చారు. ధార్ గ్యాంగ్‌కు చెందిన ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.90 లక్షల విలువ చేసే బంగారు, వజ్రాభరణాలు, రూ.19 లక్షల 35 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం అరెస్టయిన ముగ్గురిలో గ్యాంగ్ లీడర్‌పై ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలలో 32 కేసులు నమోదయ్యాయి. ఆదివారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ పి.జగదీష్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

స్థానిక శ్రీనగర్ కాలనీ శివారు ప్రాంతమైన రాజహంస స్వీట్ హోమ్స్ లోని శివారెడ్డి, రంజిత్ రెడ్డి, శివశంకర్ నాయుడు ఇళ్లల్లో జనవరి 22వ తేదీన చోరీలు జరిగాయి. ఇళ్లకు తాళం వేయడంతో ఎవరూ లేనిసమయంలో చొరబడి సుమారు రూ. 2.13 కోట్లు విలువ చేసే బంగారు వస్తువులు, వజ్రాభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. ఈ కేసుల్లో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక 4 వ పట్టణ పోలీసులు కేసులు నమోదు చేసుకున్నారు. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ పి.జగదీష్ 4 పోలీసు బృందాలను రంగంలోకి దించి మధ్యప్రదేశ్ మారుమూల గ్రామాలలో సైతం జల్లెడ పట్టించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా చడ్‌వాడు గ్రామానికి చెందిన నారుపచావర్, సావన్ అలియాస్ శాంతియదుద్యే, మహమ్మద్, మోట్ల ఈ నలుగురు కలసి గత నెల 16 వ తేదీన తమ స్వగ్రామం నుండి దొంగతనాలు చేయాలనే ఉద్దేశ్యంతో బయల్దేరి జనవరి 21వ తేదీ ఉదయం అనంతపురం చేరుకున్నారు. స్థానిక శ్రీనగర్ కాలనీ శివారు ప్రాంతమైన రాజహంస స్వీట్ హోమ్స్ లో తాళం వేసిన ఇళ్లపై రెక్కీ చేశారు. ఆ విల్లాస్ లో ఉన్న శివారెడ్డి, రంజిత్ రెడ్డి, శివశంకర్ నాయుడు ఇళ్లను టార్గెట్ చేసుకున్నారు. నారు పచావర్, సావన్ ,మహబత్, మోట్ల కలసి 22వ తేదీ తెల్లవారుజామున ఆ మూడిళ్లకు తాళాలు పగులగొట్టి ఆ ఇంట్లో చొరబడ్డారు. ఆ ఇళ్లల్లో ఉన్న విలువైన బంగారు, వజ్రాభరణాలు, నగదు ఊడ్చుకెళ్లారు. చోరీ తర్వాత హైదరాబాద్‌కు బైకులలో వెళ్లి దొంగ సొత్తు వాటాలుగా పంచుకున్నారు. నారు పచావర్, సావన్ హైదరాబాద్‌లో ఉంటూ దొంగ సొత్తును విక్రయించే ప్రయత్నం చేయగా కుదర్లేదు. అక్కడ అమ్మడం అసాధ్యమని భావించి దొంగలించిన సొమ్మును బెంగుళూరులో అమ్మే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. చివరకు మధ్యప్రదేశ్ కు చెందిన రిసీవర్ రమేష్‌ను ఫోన్లో సంప్రదించి చోరీ సొమ్మును కొనాలని కోరారు. రమేష్ దొంగ సొత్తులను కొనడంలో దిట్ట కావడంతో తనకు కుదరక తన కొడుకైన సునీల్‌ను పంపాడు. ఈ ముగ్గురు స్థానిక రాయల్ నగర్‌లో బేరం చేసుకుంటుండగా జిల్లా ఎస్పీకి సమాచారం అందింది. అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిఐలు కనుమూరి సాయినాథ్, హేమంత్ కుమార్, జయపాల్ రెడ్డి, ఎస్ఐలు రాంప్రసాద్, రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది బృందంగా ఏర్పడి ఆదివారం రాయల్ నగర్ సమీపంలో అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా చడ్‌వాడు గ్రామానికి చెందిన నారుపచావర్, సావన్ అలియాస్ శాంతియదుద్యే, పిపాల్డిల్యా గ్రామానికి చెందిన సునీల్ ఉన్నారు. గ్యాంగ్‌లోని మహబత్, మోట్ల ఇద్దరూ పరారీలో ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ.90 లక్షల విలువ చేసే బంగారు, వజ్రాభరణాలు, రూ.19 లక్షల 35 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఇదిలా ఉండగా అనంతపురం చోరీల్లో పాల్గొన్న మహబత్, మోట్ల హైదరాబాద్‌లో నారు పచావర్, సావన్‌తో దొంగసొత్తును వాటాలుగా పంచుకున్న తర్వాత వారి స్వగ్రామానికి వెళ్లారు. రిసీవర్ సునిల్ తండ్రి అయిన రమేష్ కూడా పరారీలో ఉన్నట్లు విచారణలో తేలింది. ప్రస్తుతం అరెస్టయిన ముగ్గురు, పరారీలో ఉన్న ఇద్దరు కూడా పాత నేరస్తులే. ఈ ఐదుగురిలో నారు పచావర్, మహబత్ లు ముఖ్యులు. స్వయాన ఇద్దరూ అన్నదమ్ములు. వీరికి మిగితా ముగ్గురు సోదరులుంటే వారు కూడా నేరస్తులే. ప్రస్తుతం వారు కూడా హైదరాబాద్ లోని జైలులో ఉంటున్నారు. నారు పచావర్ పై ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలలో సుమారు 32 కేసులు ఉన్నట్లు సమాచారం.మహబత్ పై కూడా నాలుగు రాష్ట్రాలలో సుమారు 29 కి పైగా కేసులున్నాయి. సావన్, సునీల్, మోట్లలపై కూడా కేసులు ఉన్నాయి. సునీల్ పై 9 కేసులు, ఈయన తండ్రి రమేష్ పై కూడా ఆంధ్ర, కర్నాటక, తమిళనాడు, తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాలలో సుమారు 34 కేసులు ఉన్నట్లు వెల్లడైంది. వీరు అంతర్రాష్ట్ర దొంగలు. పరారీలో ఉన్న గ్యాంగ్ సభ్యుల కోసం గాలింపు ప్రక్రియ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

స్వాధీనం చేసుకున్న సొమ్మును చూపుతున్న ఎస్పీ, తదితరులు

4 రాష్ట్రాలలో ధార్ గ్యాంగ్ మోస్ట్ వాంటెడ్

ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలలో ధార్ గ్యాంగ్ మోస్ట్ వాంటెడ్‌గా ఉంటోంది. ప్రస్తుతం పట్టుబడిన ముగ్గురు, పరారీలో ఉన్న ఇద్దరితో పాటు సుమారు 60 మంది దాకా ఈ గ్యాంగ్ లో సభ్యులు. అయితే ఐదారుగురు కలిసి గ్యాంగ్ గా ఏర్పడి చోరీలు చేస్తారు. వీరంతా కూడా మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా టాండ పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాలకు చెందిన వారే.

ప్రత్యేక పోలీసు బందాలకు ఎస్పీ ప్రశంస : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్ గా ఉంటూ పలు చోరీలకు పాల్పడిన ధార్ గ్యాంగ్ ను అరెస్టు చేసిన అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిఐ లు కనుమూరి సాయినాథ్, హేమంత్ కుమార్, జయపాల్ రెడ్డి, ఎస్ఐలు రాంప్రసాద్, రాజశేఖర్ రెడ్డిల ఆధ్వర్యంలో పనిచేసిన సిబ్బందిని ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

భక్తులతో కిటకిటలాడిన అశ్వర్థం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల పరిధిలోని అశ్వర్థ నారాయణస్వామి, భవాని భీమలింగేశ్వర బ్రహ్మోత్సవాలు 2వ ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా శివనామ స్మరణతో ఆశ్వర్థ నారాయణస్వామి ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఈ సందర్భంగా తెల్లవారుజాము 2 నుంచి ఉత్తర-దక్షిణ ప్రవహించే పెన్నానదిలో భక్తులు స్నానం చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. శక్తులకు ఎలాంటి అసౌకర్య కలగకుండా పోలీసులు, ఆలయ సభ్యులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు తాడిపత్రి, అనంతపురం నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఆలయ ఇఒ సుబ్రమణ్యం భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సిఐ రామసుబ్బయ్య, ఎస్ఐలు నాగేంద్రప్రసాద్, ఆంజనేయులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

అజంతా షూహౌస్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలోని వ్యాపారుల్లో నమ్మకం పెరిగిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఆదివారం నగరంలోని సుభాష్‌రోడ్డులో ఏర్పాటు చేసిన చెన్నైకి చెందిన అజంతా షూహౌస్‌ను సంస్థ ఎండి రమేష్, డైరెక్టర్ గోపీకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ సత్యప్రకాష్, శ్రీపాద వేణుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ చెన్నైకి చెందిన అజంతా కంపెనీ వారు నగరంలో 10వ షోరూమ్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ వ్యాపారాలు చేసుకునే వారికి పూర్తి స్వేచ్ఛ, తమ సహకారం ఉంటుందన్నారు. గత ఆరునెలల్లో వ్యాపారాలు చేసే వారికి ఒక నమ్మకం ఏర్పడిందన్నారు. అందుకే నగరంలో పెద్దఎత్తున షోరూమ్స్ ప్రారంభిస్తున్నారన్నారు.

అజంతా షూహౌస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

నిరుపేద విద్యార్థికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

నిరుపేద విద్యార్థికి ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ ఆధ్వర్యంలో జబర్దస్త్ టీమ్ సభ్యులతో కలిసి రూ.30వేలు ఆర్థికసాయం అందజేశారు. శెట్టూరు మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన ఈడిగ రమేష్, తిమ్మక్క కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె జ్యోతి గుత్తి గేట్స్ కళాశాలలో బిటెక్ 2వ సంవత్సరం చదువుతోంది. అయితే కళాశాల ఫీజు కట్టలేక ఇంటి వద్దనే ఉంటోంది. ఈనేపథ్యంలో గ్రామానికి చెందిన కొందరు యువకులు సమస్యను బద్దేనాయక్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు బద్దేనాయక్ కళాశాలకు చెందిన రూ.30వేల మొత్తాన్ని జబర్దస్త్ సభ్యులు అప్పారావు, నవీన్, పవన్‌నాయక్, అదుర్స్ ఆనంద్, షేకింగ్ శేషుతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్‌ఛైర్మన్ సురేష్‌కుమార్, కోశాధికారి అబ్దుల్‌వాహబ్, కార్యదర్శి హరీష్, సభ్యులు తిప్పేస్వామి, సాయినాథ్, మహాలింగ, ఉపాధ్యాయులు అశోక్‌కుమార్, రాము, ఆది, ఆంధ్ర తిప్పేస్వామి, మురళి, తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న బద్దేనాయక్, జబర్దస్త్ సభ్యులు

సేవాలాల్ మహారాజ్ జయంతి పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బంజారాల కాశీక్షేత్రం సేవాఘడ్‌లో ఈనెల 13, 14, 15 తేదల్లో నిర్వహిస్తున్న సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల గోడపత్రికలను అనంతపురం డీఎస్పీ వెంకటేశ్వర్లు, ప్రజాబలం అధ్యక్షులు చందునాయక్ ఆదివారం ఆవిష్కరించారు. బంజారాలు తమ ఆరాధ్య దైవాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దినేష్, సూరి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

జిపిఎస్ ఆధ్వర్యంలో..

అలాగే నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గిరిజన ప్రజా సమాఖ్య ఆధ్వర్యంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిపిఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జి.మల్లికార్జున నాయక్, గిరిజన ప్రజా సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సాకే ఆనంద్, జాతీయ సలహాదారులు డి.నారాయణస్వామి నాయక్, ఎస్సీ,ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శాంతకుమార్, ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంత్రి సుదర్శన్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డీకే రామలింగం, ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర, నాయకులు రాళ్లపల్లి చంద్రశేఖర్, నరసింహులు, సాకే పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఉచిత గుండె వైద్య-శిబిరం

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, టిడిపి సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు సహకారంతో ఆదివారం వజ్రకరూరు మండల పరిధిలోని గంజికుంట గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా గుండె వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా అనంతపురానికి చెందిన మార్క్ ఆసుపత్రి వైద్యులు బిపి, షుగర్, ఇసిజి, 2డి ఎకో వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నూతేటి వెంకటేశ్వర్లు, జిల్లా పార్లమెంట్ కార్యదర్శి సుధాకర్, నాయకులు ఆవుల వెంకటేశులు (రైల్వే), ఆవుల ధనంజయ, ఆవుల వెంకటేశులు, ఆవుల మొరార్జీ, ఆవుల రామకృష్ణ, జంగం జయేంద్ర, గుజ్జుల నాగరాజు, హాజీ అస్లాం, తదితరులు పాల్గొన్నారు.

గుండె పరీక్షలు చేస్తున్న వైద్యులు

నేడు గ్రామసభలు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, వెంకటాంపల్లి గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కార్యక్రమాలకు ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కావున అధికారులు, నాయకులు హాజరుకావాలని కోరారు. అలాగే ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే విన్నవించుకోవాలన్నారు.

నేడు కలెక్టరేట్‌లో

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని ప్రజలు తమ సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

IN THE COURT OF MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL- CUM-I ADDITIONAL DISTRICT JUDGE : KADAPA
M.V.O.P.No. 372/2023
మంగళి సుబ్బరాయుడు & ఇతరులు
...వాదులు (Petitioners)
VS
క్రిష్ణ గిరీష కుమార్, S/o K.క్రిష్ణ KA05 AE 8540 అంబులెన్స్ ఓనరు, డోర్‌నెం. 19-1-35, వినాయక నగర్, అనంతపురము - 515001
...ప్రతివాది నెం. 1(Respondent No.1)
నోటీసు
ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా పై తెలిపిన వాదులు మీపై పైకోర్టులో V/S 166 MV Act క్రింద నష్టపరిహారం కేసు వేసి వున్నారు. కేసు వాయిదా 18-2-2025 ఉన్నది. మీకు ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టులో స్వయంగా కాని వకీలు ద్వారా కాని 18-2-2025 ఉదయం 10.30 గంటలకు ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షముగా తీర్మానించబడునురు
// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
బి. మురళీధర్
న్యాయవాది, కడప.

CHANGE OF NAME & FATHER'S NAME
Momin Mohammed Abuzer (old Name) son of Momin Abdul Razak (old Name) R/o 1-1-8/1, bellary road, Rayadurg-515865, Ananthapur District of Andhra Pradesh. I and my Father's Name has been changed as **Shaik Mohammad Abuzer** (New Name)Son of **Shaik Abdul Razack** (New Name) vide affidavit dated on 08/02/2025 sworn before Notary by S.Channaveerappa, Rayadurg-515865.

సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి 'జూపల్లి'

పుస్తకావిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

దళిత బహుజన వాదాల దక్పథంతో పని చేసిన సామాజిక వ్యక్తి జూపల్లి ప్రేమ్‌చంద్ అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు బి.ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జూపల్లి రచించిన 'ఆధునిక తెలుగు వచన కవిత్వం విభిన్న ధోరణలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జూపల్లి ప్రేమచంద్ చైతన్యవంతమైన సాహిత్యాన్ని తెలుగు సాహిత్యానికి అందించారన్నారు. అంతేగాకుండా సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తి అన్నారు. తర్వాత పుస్తకాన్ని సమీక్ష చేసిన తూముచర్ల రాజారామ్ ప్రసంగిస్తూ ఆధునిక తెలుగు కవిత్వంలో వచ్చిన ధోరణులను నిశితంగా పరిశీలించి భావితరాలకు గొప్ప సిద్ధాంత గ్రంధాన్ని జూపల్లి అందించారని . ఆధునికత అంటే జీవన విధానం మరియు సామాజిక తాత్వికత అనే కొత్త సూత్రాన్ని జూపల్లి ప్రేమ్ చంద్ ఆవిష్కరించారు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి, జంగా గౌతమ్, ఉప్పరపాటి వెంకటేశులు, నానీల నాగేంద్ర, జూపల్లి ప్రేమ్ చంద్ శ్రీమతి జూపల్లి రాజేశ్వరి, జూపల్లి పిల్లలు జూపల్లి శంతన్, డాక్టర్ జూపల్లి అపర్ణ, హెచ్.నాగలింగయ్య, డాక్టర్ గేయానంద్, డాక్టర్ ప్రసూన, చెట్ల ఈరన్న, అమరనాథ్‌రెడ్డి, డాక్టర్ నానీల నాగేంద్ర, తన్నీరు నాగేంద్ర, నిర్మలారాణి, కంబదూర్ షేక్ నబిరసూల్, ఏ ఓబుళపతి, దాసన్న గారి కృష్ణమూర్తి, కాంగ్రెస్ నాయకులు శంకర్, బంగి సుదర్శన్, శ్రీరాములు, షేక్ రియాజుద్దీన్ డాక్టర్ జూటూర్ షరీఫ్, మధురశ్రీ, నిమ్మల వరప్రసాద్ పాల్గొన్నారు.

జూపల్లి ప్రేమ్‌చంద్ రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్షలు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని 10 వ తరగతి విద్యార్థులకు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని స్థానిక ఎపి మోడల్ స్కూల్‌లో ప్రజ్ఞ వికాస్ మాదిరి పరీక్ష నిర్వహించారు. ముందుగా ఎంఇఒ-2 వెంకటరమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగిశివ, యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎంఎల్. శ్రీనివాస్, నాగేంద్ర, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు ఆవుల మనోహర్, తదితరులు ప్రశ్నపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఇలాంటి మాదిరి పరీక్షలు నిర్వహించడం వల్ల 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలంటే భయం పోతుందన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు సమస్యలపై పోరాటాలే కాకుండా.. విద్యార్థుల చదువుకు ఉపయోగపడే విధంగా ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు సుకన్య, లక్ష్మీ, భువన, వైశాలి, సంధ్య, సౌమ్య, కీర్తన, రూప, లక్ష్మి, అంకిత, ఆశ, దుర్గమ్మ, అంజలి, సౌజన్య, వలి, గణేష్, ఆదర్, గౌతమ్, వీరేష్, వంశీ, రాము, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మాదిరి పరీక్షల ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న ఎంఇఒ

మాతృశ్రీ ఆసుపత్రిలో అక్రమ వసూళ్లు

చికిత్సలో వైద్యుల నిర్లక్ష్యం-బాధితుల ఆవేదన

ప్రజాశక్తి-గుత్తి

చికిత్స కోసం వస్తున్న రోగుల నుంచి గుత్తిలోని మాతృశ్రీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు అక్రమ వసూళ్లకు తెరలేపారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ పథకం కింద వివిధ రోగులకు శస్త్ర చికిత్సలు, గర్భిణులకు సిజేరియన్ చేస్తామంటూ నమ్మబలికి అనంతరం వారి నుంచి రూ.వేలకు వేలు దండుకుంటున్న బాధితులు లబోదిబోమంటు న్నారు. ఇందుకు ఆదివారం ఆసుపత్రిలో జరిగిన ఓ ఘటన ఉదాహరణగా నిలుస్తోంది. గార్లదిన్నె మండలం కొప్పలకొండ గ్రామానికి చెందిన బి.సుజితకు పురిటి నొప్పులు రావడంతో గుత్తి పట్టణంలోని మాతృశ్రీ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు కాన్పు చేయటానికి ఆరోగ్యశ్రీ కింద సిజేరియన్ చేస్తామని నమ్మబలికారు. ముందుగా రూ.12వేలు డిమాండ్ చేసి కట్టించుకున్నారు. తాము చెల్లించిన నగదుకు బిల్లు ఇవ్వాలని కోరగా ఇవ్వడానికి వీలు లేదని ఆసుపత్రి తెలిపారు. దీంతో గర్భిణి మరిది రవితేజ ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ స్థానిక వైద్య అధికారులను ఆసుపత్రికి పంపించి గర్భవతికి చికిత్సలు అందించేలా చర్యలు చేపట్టినట్లు బాధితుడు తెలిపాడు. గతంలో కూడా అప్పెండెక్స్ శస్త్ర చికిత్స, సిజరిన్లకు కూడా వేలాది రూపాయలు ఆస్పత్రి సిబ్బంది వసూలు చేశారని పలువురు అంటున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

విలేకరుల ముందు వాపోతున్న బాధితుడు రవితేజ

ప్రభుత్వ లాంఛనాలతో హెడ్ కానిస్టేబుల్ అంత్యక్రియలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందిన టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ నారాయణనాయక్ అంత్యక్రియలను ఆదివారం పుట్టపర్తి మండలం పెడపల్లి గ్రామంలో ప్రభుత్వ లాంచనాలతో నిర్వహించారు. పుట్టపర్తి మండలం పెడబల్లి గ్రామానికి చెందిన నారాయణనాయక్ 1990లో జిల్లా పోలీస్ ఎఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా చేరాడు. తర్వాత సివిల్ విభాగానికి వెళ్ల వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. పదోన్నతితో హెడ్ కానిస్టేబుల్‌గా అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో గతనెల విధుల్లో ఉన్న నారాయణ నాయక్ అనంతపురం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని సోములదొడ్డి సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. గాయపడిన బాధితుడిని అనంతపురం.. తర్వాత మెరుగైన చికిత్స కోసం బెంగుళూరు, హైదరాబాద్‌కు తరలించారు. అయినా పరిస్థితి విషమించి శనివారం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చనిపోయాడు. దీంతో మృతదేహాన్ని స్వగ్రామం పెడబల్లికి తీసుకొచ్చి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో అనంతపురం టూటౌన్ సిఐ శ్రీకాంత్, పుట్టపర్తి రూరల్ ఎస్సై లింగన్న, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , గాండ్ల హరినాథ్ , రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యకుమార్, లక్ష్మీనారాయణ , సిబ్బంది బ్యాచిమేట్లు, బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి-నార్పల

భూమి ఉన్న ప్రతి రైతుకూ ఒక ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నవీరస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా సేవలు అందించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య పని చేస్తుందన్నారు. ముఖ్యంగా భూ ఆధారిత పథకాలైన పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, సూక్ష్మసేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం, తదితర పథకాలు నేరుగా పొందే వీలు కలుగుతుందన్నారు. రైతులు వారి పరిధిలోని రైతు సేవా సిబ్బందిని కలిసి ఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవాలని కోరారు.

యాడికి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశా లమేరకు రైతులకు కొత్తగా గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గుర్తింపు కార్డు వల్ల రైతులకు ఎలాంటి సాంకేతిక లోపాలు లేకుండా ప్రభుత్వం ఏదైనా పథకం విడుదల చేసినట్లయితే నేరుగా వారి ఖాతాల్లోకే జమ అవుతాయన్నారు. ముఖ్యంగా పిఎం కిసాన్, బ్యాంకు రుణాలు, పెట్టుబడి రాయితీలు, వివిధ రకాల సబ్సిడీలు పంపిణీ వంటివి నేరుగా పొందే అవకాశ ఉంటుందన్నారు. కావున రైతులు తమ ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్, పట్టాదారు పాస్ పుస్తకాన్ని మీ పరిధిలోని రైతుసేవా కేంద్రాలకు తీసుకెళ్లి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

అనంతపురం : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం 1 నుంచి 19 ఏళ్లలోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు డిఎంహెచ్ఒ ఇబి.దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్న భోజన అనంతరం అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రయివేటు విద్యాలయాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, జూనియర్ పాఠశాలలు, కళాశాల్లోని పిల్లలందరికీ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. కావున ఆయా ప్రభుత్వం శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు సహకరించి నులిపురుగుల రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.

వైసిపి మండల కన్వీనర్‌కు సన్మానం

యాడికి : వైసిపి మండల కన్వీనర్‌గా నియమితులైన తూట్రాళ్లపల్లి సర్పంచి సంజీవరాయుడును మండల నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా బొకే అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు రామకృష్ణ, శ్రీనివాసులు, బాలాంజనేయులు, లక్ష్మీనారాయణ, నాగేంద్ర, శ్రీరంగ, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి, బోయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మణిరవి

అనంతపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాల్మీకి, బోయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన మణిరవి నియమితులయ్యారు. ఈమేరకు వాల్మీకి, బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అధ్యక్షుడు బోయ విక్రమ్‌నాయుడు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మణిరవి వాల్మీకి గతంలో ఉమ్మడి అనంతపురం జిల్లా వాల్మీకి బోయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా, జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు బోయ విక్రమ్‌నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి నాయుడు బోయ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై రాష్ట్ర నాయకత్వం ఉంచిన నమ్మకానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. ముఖ్యంగా వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తనవంతు పోరాటం చేస్తానని తెలిపారు.

నెలాఖరు వరకూ పంటలకు నీరివ్వాలి

ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ రాజారెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈనెలాఖరు వరకూ పంటలకు కాలువల ద్వారా నీరందించాలని ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరి ఛైర్మన్ దిమ్మగుడి రాజారెడ్డి కోరారు. ఆదివారం పామిడి, పెద్దవడుగూరు మండలాల పరిధిలోని ఉత్తర కాలువలో సాగునీరు ప్రవాహ సామర్థ్యాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా రైతులతో పంటల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈనెల 15వతేదీ వరకూ మాత్రమే నీరు అందజేస్తామని అధికారులు ప్రకటించారని, అలా చేస్తే చేతికందిన పంట పాడైపోతుందని రైతులు వాపోయారు. రైతుల సమస్యలు విన్న రాజారెడ్డి నేరుగా నీటి పారుదల శాఖ డిఇని కలిసి సమస్యను వివరించారు. స్పందించిన అధికారులు తప్పకుండా ఉన్నత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట టిడిపి నాయకులు బద్రి, గిరప్పనాయుడు, సాంబ, రైతులు ఉన్నారు.

కాలువను పరిశీలిస్తున్న ఉత్తర కలువ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ రాజారెడ్డి

సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

నగరంలోని అర్బన్ టిడిపి కార్యాలయంలో 9మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.9.30లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గానికి 8 నెలల్లో 8వ విడుతల్లో సుమారు రూ.67 లక్షల వరకూ సిఎంఆర్ఎఫ్ నిధులు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి మనసుకు ఈ నిధులు నిదర్శనమన్నారు. పేదలకు కష్టం ఉందంటే క్షణం ఆలోచించకుండా ముఖ్యమంత్రి స్పందిస్తున్నారన్నారు. అలాగే ప్రతినెలా 1వతేదీన సామాజిక పింఛన్లు అందజేస్తున్నామన్నారు. వీటితోపాటు అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు.

ఆకుల రఘురామయ్యకు సన్మానం

నార్పల : వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సాహిత్య సాంస్కృతిక మహాసభల్లో జిల్లాకు చెందిన ఆకుల రఘురామయ్యను ఘనంగా సన్మానించారు. ఈనెల 8, 9వతేదీల్లో కడప జిల్లాలోని శంకరాపురంలో ఉన్న ఐఎంఎ ఆడిటోరియంలో 'వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం- రాయలసీమ భాగస్వామ్యం' అనే అంశంపై మహాసభలు నిర్వహించారు. ఈ మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన శతాధిక కవిసమ్మేళనంలో తెలుగు పద కవితా పితామహుడు అన్నమయ్య గురించి ఆకుల రఘురామయ్య కవితా గానం చేశారు. దీంతో రఘురామయ్యను ఘనంగా సత్కరించడంతోపాటు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, మెడల్ అందజేశారు.

ఆకుల రఘురామయ్యను సన్మానిస్తున్న వక్తలు

12న నరసింహస్వామి రథోత్సవం

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మల్లాపురం సమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం ఈనెల 12వతేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు అడియాన్ రామ్మూర్తిస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణం, 11న స్వామివారి కల్యాణోత్సవం, 19వ మాల దీక్షధారణ, ఉచిత వివాహాలు, 12న బుధవారం స్వామివారి బ్రహ్మోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

నార్పల : అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గడ్డంనాగేపల్లి గ్రామంలో పేదల నుంచి సిపిఐ నాయకులు వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు పల్లెల్లో మూడు సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఇళ్ల నిర్మానాలకు రూ.5లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సాకే గంగాధర్, నాయకులు నాగరాజు, సుధాకర్, సహాయ కార్యదర్శి చాపల రామాంజి, సూరి, చంద్ర, నారప్ప, నాగలక్ష్మి, చిన్నక్కయ్య, అలివేలమ్మ, తులసమ్మ, పాపోడు, రాముడు, చిన్న వీరప్ప, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో నిందితుల అరెస్టు

శింగనమల : పలుచోట్ల ఆలయాల్లో చోరీలకు పాల్పడిన నిందితులను శింగనమల పోలీసులు అరెస్టు చేశారు. రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో శింగనమల సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్‌తో కలిసి అనంతపురం రూరల్ డిఎస్పీ టి.వెంకటేష్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల మేరకు.. కురుగుంటకు చెందిన కూరుపాటి సాయికుమార్, అక్కంపల్లి వైఎస్ఆర్ కాలనీకి చెందిన కనుముక్కల చాంద్‌బాషా, ఎ.నారాయణపురం ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ సర్దార్‌వలి, బళ్లారి బైపాల్‌లోని ఎల్‌బినగర్‌కు చెందిన బి.సాదిక్‌బాషా వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలను అలవాటు చేసుకున్నారు. ఈనేపథ్యంలోనే శింగనమల, గార్లదిన్నె, నార్పల, అనంతపురం రూరల్, ఆత్మకూరు పోలీసుస్టేషన్ల పరిధిల్లోని పలు ఆలయాల్లో దేవతామూర్తులకు అలంకరించిన వెండి ఆభరణాల చోరీలకు పాల్పడ్డారు. ఈనేపథ్యంలో ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు డీఎస్పీ టి.వెంకటేష్ పర్యవేక్షణలో సిఐ కౌలుట్లయ్య సిబ్బంది దాడి చేసి నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి 3 కిలోల వెండి ఆభరణాలు, 3 సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేష్

వెంగమనాయుడు కాలనీలో చోరీ

పామిడి : స్థానిక వెంగమనాయుడు కాలనీలో ఉన్న ఓ ఇంట్లో దొంగలు చొరబడి బంగారు నగలు ఎత్తుకెళ్లిన ఘటన చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని వెంగమనాయుడు కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాసరెడ్డి ఫొటో స్టూడియో పెట్టుకుని జీవనం కొనసాగించేవాడు. ఈక్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి శనివారం కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయ దర్శనానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని దుండగులు ఇంటి బీగాన్ని పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి బీరువాలో ఉన్న 20 తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. ఇంటికి వచ్చిన శ్రీనివాసరెడ్డి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తోటల్లో కేబుల్ వైర్లు..

శింగనమల : మండల పరిధిలోని పెద్దమట్లగొంది. చిన్న మట్లగొంది గ్రామాలలోని తోటలలో రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పలువురి రైతుల విద్యుత్ కేబుల్ వైర్లు. అపహరించారు. దాదాపు రెండు నెలల క్రితం ఒకసారి. మళ్లీ నెలరోజుల క్రితం ఇదే గ్రామంలో విద్యుత్ కేబుల్ వైర్లు చోరీ చేశారు. వరుసగా మూడోసారి శనివారం దొంగలు చోరీకి పాల్పడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెరిగిన పంట పెట్టుబడులు. గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్న తమను ఈ వరుస కేబుల్ వైర్ల చోరీతో మరింత నష్టపరుస్తున్నారని. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక దష్టి పెట్టి దొంగలను పట్టుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం పరిధిలోని మానిరేవు గ్రామంలో కొండాపురం దారి పక్కన ఉన్న రైతు పాళ్యం రాజేశ్వరమ్మకు చెందిన పొలంలో గుర్తు తెలియని దుండగులు డ్రిప్ పరికరాలను చోరీ చేశారు. ఇందులో భాగంగా రెండు బోర్లకు ప్రభుత్వం అందించిన నీటి ఫిల్టర్లు, డ్రిప్ పరికరాన్ని దొంగలించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

డ్రిప్ పరికరాలను చోరీ చేసిన దృశ్యం

బియ్యం పట్టివేత

తాడిపత్రి రూరల్ : పట్టణంలోని గన్నవారిపల్లికాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్‌బియ్యాన్ని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. పక్కాగా అందిన సమాచారం మేరకు అదనపు ఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ఆదేశాలతో రూరల్ సీఐ శివ గంగాధర్‌రెడ్డి, టౌన్ ఎస్ఐ గౌస్ సిబ్బందితో కలిసి దాడులు చేసి గన్నవారిపల్లి కాలనీలో వెంకటన్న నిల్వ ఉంచిన 45, సముద్రుడు నిల్వ ఉంచిన 35 బియ్యం ప్యాకెట్లను సీజ్ చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.